క్లుప్తంగా

రేపు నైమిశారణ్య పీఠాధిపతి రాక

చాపాడు : మండలంలో ముఖ్య పుణ్యక్షేత్రమైన అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామి దేవస్థాన సన్నిధికి మంగళవారం హిందూ ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపకులు శ్రీకాకుళం నైమిశారణ్య పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి స్వామి రానున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపారు. వీరభద్ర స్వామి సన్నిధిలో ఉదయం 9 గంటలకు శ్రీ శివలీల విలాసం ప్రవచనాలు బోధిస్తారన్నారు. మండలంలోని వీరభద్ర స్వామి భక్తులందరూ హాజరుకావాలని ఆలయ ఈఓ కోరారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

అట్లూరు : మండలంలోని అట్లూరు క్రాస్‌ రోడ్డులోని రెడ్డి మెడికల్‌షాపు యజమాని పల్లెం శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కడప పట్టణానికి చెందిన శ్రీకర హాస్పిటల్‌ ఊపిరితిత్తుల వైద్యనిపుణులు రామాంజుల రెడ్డి, కీళ్ల ఎముకలు వైద్యుడు విశ్వేశ్వరరెడ్డి, జనరల్‌ వైద్యుడు షేక్‌మహమ్మద్‌ఆలీలు ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు.

గ్రంథాలయం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమిరుద్దీన్‌

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులోని శాఖా గ్రంథాలయాన్ని ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి ఎస్‌.అమిరుద్దీన్‌ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రంథాలయంలో రికార్డులు, రోజువారి గ్రంథాలయ సందర్శకుల రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాపాడులోని శాఖా గ్రంథాలయంలో 292 మంది సభ్యత్వం మాత్రమే ఉన్నాయని పాఠకుల సంఖ్య మరింత పెంచాలని సూచించారు. క్రమం తప్పకుండా గ్రంథాలయాన్ని పాఠకులకు అందుబాటులో ఉంచాలని, ప్రతి ఏటా వేసవి శిక్షణా తరగతులను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో చాపాడు గ్రంథాలయ అధికారి జే.శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు గూడ్స్‌ వాహనం వేలం

రాజుపాళెం : రాజుపాళెం పోలీస్‌ స్టేషన్‌లో సోమవారం నాలుగు చక్రాల గూడ్స్‌ వాహనం వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ రాజగోపాల్‌ ఆదివారం తెలిపారు. ఎస్పీ అన్బురాజన్‌ ఆదేశాల మేరకు ఏఎస్పీ ప్రేరణకుమార్‌ పర్యవేక్షణలో వేలం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనవచ్చన్నారు.

జాబ్‌మేళాలో 52 మంది ఎంపిక

పోరుమామిళ్ల : పోరుమామిళ్లలో మాజీ సైనికుల అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన జాబ్‌మేళాలో 52 మందిని ఎంపిక చేసినట్లు సైనిక సంఘం అధ్యక్షుడు రాముడు తెలిపారు. ఎంపికైన వారికి త్వరలో ఆర్డర్స్‌ అందుతాయన్నారు. హైదరాబాదు నుంచి జీఎంఆర్‌ గ్రూప్‌ కంపెనీస్‌ మేనేజర్‌ హనుమంతరావు, బెంగుళూరు నుంచి గీతం యూనివర్శిటీ సెక్యూరిటీ ఆఫీసర్‌ లక్ష్మీకాంతరెడ్డి మేళాలో పాల్గొన్నారన్నారు.

200 మందితో బైక్‌ ర్యాలీ

మైదుకూరు : బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా ప్రొద్దుటూరులో ఏర్పాటు చేసిన రాయలసీమ జోనల్‌ సమావేశానికి మైదుకూరు నుంచి 200 బైకులతో బీజేపీ నాయకులు ర్యాలీగా వెళ్లారు. నియోజకవర్గ బీజేపీ అధ్యక్షుడు మాచనూరు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ఈ బైక్‌ర్యాలీ నిర్వహించారు. నరేంద్రమోదీ, పురందేశ్వరి నాయకత్వాన్ని బలపరచాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

దువ్వూరు : మండల పరిధిలోని చింతకుంట గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్న ఆరుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఆదివారం ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. జూదరుల నుంచి రూ.5,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఆయన పేర్కొన్నారు.

మొదలైన మొహర్రం వేడుకలు

కాశినాయన : మండలంలోని అంబవరంలో మొహర్రం వేడుకలు గ్రామంలోని పెద్దపీరయ్యస్వామి పీర్లచావిడిలో నిర్వాహకుల ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. మొహర్రం సందర్భంగా 27వ తేదీన చిన్నసరిగెత్తు, 29వ తేదీన పెద్ద సరిగెత్తు, 30వ తేదీన పీర్లు బావికి వెళ్ళడంతో పీర్లపండుగ ముగుస్తుంది.

నేడు ఈ-క్రాప్‌ నమోదుపై శిక్షణ

గోపవరం : ఖరీఫ్‌ సీజన్‌లో సాగయ్యే పంటలకు సంబంధించి ఈ-క్రాప్‌ నమోదుపై సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం ఉంటుందని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ తెలిపారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు. తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఏఓ అరవిందనాయక్‌, క్షేత్రస్థాయి రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది పాల్గొంటారని తెలిపారు.

పేదల కోసమే రాజన్న భోజనం

- ఆకలి విలువ తెలుసు కాబట్టే ఏర్పాటు చేశా
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : పేద ప్రజల ఆకలి తీర్చేందుకే రాచమల్లు వారి రాజన్న భోజన శాలను ఏర్పాటు చేశానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. ఇది ఏ మాత్రం రాజకీయాలకు సంబంధం లేని వ్యక్తిగతమైన కార్యక్రమం అన్నారు. ఏ స్వార్థం లేకుండా, ఏ ప్రయోజనాన్ని ఆశించకుండా నా హృదయానికి సంబంధించి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజకీయాలు మరో రూపంలో చేయవచ్చు కానీ, ఈ కార్యక్రమం ద్వారా చేయాల్సిన అవసరం లేదన్నారు.

మీ కుటుంబ సభ్యుడిలా ఆహ్వానిస్తున్నా

పేదలు మొహమాటం లేకుండా ప్రతి రోజూ వచ్చి రాచమల్లు వారి రాజన్న భోజనంలో అన్నం తినాలని, మీ కుటుంబ సభ్యుడిలా ఆహ్వానిస్తున్నానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. సురేష్‌నాయుడు క్యాంటీన్‌కు ఆదివారం సెలవు కావడంతో 4వేల మందికి కలర్‌ రైస్‌, గుడ్డు, గోంగూర, మసాల పులుసు ఏర్పాటు చేశామన్నారు.

సీఎం సురేష్‌ను అభినందిస్తున్నా

ప్రొద్దుటూరులో మరో చోట అన్నదానం నిర్వహిస్తున్న సీఎం సురేష్‌ నాయుడును తాను అభినందిస్తున్నానని, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఇద్దరం అన్నం పెట్టడం వల్ల వచ్చే ప్రజల సంఖ్య తగ్గుతుందని, తద్వారా ఎక్కువ కాలం ఈ కార్యక్రమాన్ని నిర్వహించవచ్చన్నారు. అవసరమైతే ఒక రోజు సురేష్‌నాయుడు క్యాంటీన్‌కు వెళ్లడానికి కూడా తాను సిద్ధంగా ఉన్నానన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, 4వ వార్డు కౌన్సిలర్‌ వరికూటి ఓబుళరెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్‌ కాకర్ల నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పుట్టిన ఊరికి సేవ చేయడం అభినందనీయం

రాజుపాళెం : ఉన్నత స్థానంలో ఉన్నప్పటికీ పుట్టిన ఊరును మరిచిపోకుండా బండి ఆత్మకూరు కొండారెడ్డి, ఆయన కుమారులు గ్రామానికి చేసిన సేవలు అభివృద్ధిని కూలూరు గ్రామ ప్రజలు మరిచిపోకూడదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. మండలంలోని కూలూరులో జరిగిన రూ.1.30 కోట్ల అభివృద్ధి పనులను ఎమ్మెల్యే రాచమల్లు, ఆ గ్రామానికి చెందిన రాష్ట్ర కాలుష్యమండలి ముఖ్య కార్యదర్శి బండి ఆత్మకూరు శ్రీధర్‌ రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ గ్రామానికి చెందిన కొండారెడ్డి, ఆయన కుమారులు కీర్తిశేషులు శరత్‌చంద్రారెడ్డి, శ్రీధర్‌ రెడ్డి గ్రామానికి చేసిన సేవలను అభినందించారు. శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఉన్న తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థాయిలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌ డీఈ మల్లేశ్వరరెడ్డి , జెడ్పీటీసీ అంజనీకుమారి, సర్పంచ్‌ శ్రీధర్‌, ఎంపీపీ సలోమి, వైస్‌ ఎంపీపీ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ రాజారాంరెడ్డి, పీఆర్‌ ఈఈ శ్యాంసుందర్‌, గ్రామ పెద్దలు జయరామకృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, శివరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం టంగుటూరు గ్రామంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో శ్రీధర్‌రెడ్డి అభివృద్ధి పనులను ప్రారంభించారు.

వైద్యుల సేవలు అభినందనీయం

రాజుపాళెం : గ్రామస్తుల కోసం వైద్యులు వచ్చి వైద్య సేవలందించడం అభినందనీయమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి అన్నారు. రాజుపాళెం హైస్కూలులో ఆదివారం కేంద్ర సహకార బ్యాంకు ఇప్కో టోక్యో బీమా, రోటరీ క్లబ్‌ సారథ్యంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే రాచమల్లు, ఆప్కాబ్‌ చైర్‌ పర్సన్‌ మల్లేల ఝాన్సీరాణి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆప్కాబ్‌ చైర్‌ పర్సన్‌ మాట్లాడుతూ ప్రముఖ వైద్యులతో ప్రజలకు ఆరోగ్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు చెప్పారు.కార్యక్రమంలో ప్రొద్దుటూరు రోటరీ క్లబ్‌ అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాదరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు అంజనీకుమారి, కేంద్ర, జిల్లా సహకార బ్యాంకు అడ్వైజర్‌ సహదేవరెడ్డి, కడప డీసీసీబీ బ్యాంకు జీఎం రాజామణి, ప్రొద్దుటూరు బ్రాంచ్‌ మేనేజర్‌ చెన్నకృష్ణారెడ్డి, పి.టంగుటూరు సహకార సంఘం చైర్మన్‌ బాలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

బ్రహ్మంగారిమఠం : కాలజ్ఞాన ప్రబోధకర్త పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం అభివృద్ధి బాటలో పయనిస్తోంది. మఠాలకు మఠాధిపతులే కార్యనిర్వాహకులు. బ్రహ్మంగారిమఠం పఠాధిపతి వీరభోగ వెంకటేశ్వరస్వామి కరోనాతో శివైక్యం చెందడంతో మఠాధిపతి నియామకం వరకు దేవదాయ శాఖ ఆధీనంలోకి మఠం వచ్చింది. కార్యనిర్వాహకులుగా ఏసీ శంకర్‌ బాలాజీకి దేవదాయశాఖ బాధ్యతలు అప్పగించింది. మఠం దేవస్థానంలో అభివృద్ధి పనులకు పిట్‌పర్సన్‌ శంకర్‌ బాలాజీ శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా దేవస్థానం నిధులతో కొన్ని పనులు, దాతల సహకారంతో కొన్ని పనులు ప్రారంభించారు. దేవస్థానం అభివృద్ధి కోసం కంది మల్లాయ్యపల్లె పుర ప్రజలతో పాటు స్థానిక వివిధ పార్టీల నాయకులు, శాసనసభ్యులు కృషితో పిట్‌పర్సన్‌ ముందుకు వెళుతున్నారు. మఠం దేవస్థానం ఆవరణంలో రూ. 30 లక్షలతో ఐ మ్యాక్స్‌ లైట్లు ఏర్పాటు చేశారు.

మణిపూర్‌ దుర్ఘటన దోషులను శిక్షించాలి



మణిపూర్‌ సంఘటనపై నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

మైదుకూరు : మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారానికి పాల్పడిన దోషులను వెంటనే శిక్షించాలని సీపీఐ నాయకులు డిమాండ్‌ చేశారు. ఘటనపై ఆదివారం వారు మైదుకూరులోని అంబేడ్కర్‌ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్‌.నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ మణిపూర్‌లో రెండు తెగల మధ్య జరుగుతున్న సామాజిక, రాజకీయ, ఆర్థిక, భూ తగాదాల అంశాలపై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయమని తెలిపారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నేడు మణిపూర్‌ అగ్నిగుండంగా మారిందని, ఈ సెగలు దేశాన్నికంతా వ్యాపించకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన వారే మహిళల భక్షణకు ఉసిగొల్పడం సమంజసం కాదని, వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి శ్రీరాములు, కార్యవర్గ సభ్యులు పి.భాస్కర్‌, ఏవీ శివరామ్‌, బీవీ శ్రీనివాసులు, ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు పి.పవన్‌కుమార్‌, బాలాజీ, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు పీవీ రమణమ్మ, సుజాత పాల్గొన్నారు.

కలసపాడులో శాంతియుత ర్యాలీ

కలసపాడు : మణిపూర్‌లో జరిగిన విధ్వంసకాండకు నిరసనగా ఆదివారం కలసపాడులో కతోలిక క్రైస్తవ సంఘ సభ్యులు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సేవ్‌ మణిపూర్‌ అంటూ నినాదాలు చేస్తూ మూడు రోడ్ల కూడలిలోని వైఎస్‌ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడి నిరసన తెలియజేశారు.

మణిపూర్‌ మారణకాండ మాయని మచ్చ

బద్వేలు అర్బన్‌ : మణిపూర్‌ మారణకాండ మానవత్వానికే మాయని మచ్చ అని యూటీఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు ఎం.విజయకుమార్‌ తెలిపారు. ఆదివారం స్థానిక ఎన్‌జీవో హోంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడిచిన రెండు నెలలుగా మణిపూర్‌లో పెద్ద ఎత్తున హత్యలు, అల్లర్లు జరుగుతున్నప్పటికీ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వీరేన్‌సింగ్‌ చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని మణిపూర్‌లో జరుగుతున్న హింసను నిలువరించాలని కోరారు.

కొద్దిపాటి వర్షానికే మడుగులా ప్రధాన రహదారి



ఆర్టీసీ బస్టాండు వద్ద ప్రధాన రహదారి

పోరుమామిళ్ల : పట్టణ ప్రధాన రహదారిలో సంవత్సరం క్రితం దాదాపు రూ.23 కోట్లతో రోడ్డు డివైడర్‌ పనులు (4లైన్స్‌) చేపట్టారు. కాంట్రాక్టర్‌ నిర్లక్ష్యంగా పనులు నిర్వహిస్తుండటంతో పోరుమామిళ్లలో అటు వాహనదారులు, ఇటు ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలల్లో పూర్తి కావాల్సిన పనులు రెండో సంవత్సరం కూడా అయ్యేలా కనిపించడం లేదు. శనివారం రాత్రి కురిసిన కొద్దిపాటి వర్షానికి అంబేద్కర్‌ సర్కిల్‌ వద్ద, ఆర్టీసీ బస్టాండు వద్ద రోడ్డు నీటి మడుగులా తయారైంది. కాంట్రాక్టర్‌ ముందుగా డ్రైనేజీ పనులు చేయకుండా రోడ్డుపని చేపట్టడంతో ఈ పరిస్థితి తలెత్తిందని ప్రజలు వాపోతున్నారు. రోడ్డుకు అవసరమైన స్థలం వరకు భవనాలు, ఆక్రమణలు తొలగించి డ్రైనేజీ ఏర్పాటు చేయగలిగితే సమస్య పరిష్కారమవుతుందని ప్రజలు భావిస్తున్నారు. రోడ్డు, డ్రైనేజీ పనులను త్వరగా పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు బేతాయపల్లెలో స్పందన

గోపవరం : మండలంలోని బేతాయపల్లె సచివాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు స్పందన కార్యక్రమం ఉంటుందని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ తెలిపారు. అన్నిశాఖల అధికారులతో పాటు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలన్నారు. సచివాలయం పరిధిలోని ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు మండల సమావేశం

జమ్మలమడుగు రూరల్‌ (మైలవరం) : మైలవరం మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ చేరెడ్డి సావిత్రి అధ్యక్షతన జరుగుతుందని మండల ఎంపీడీఓ రామచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

విశ్వరూప మహాసభలను విజయవంతం చేయండి

జమ్మలమడుగు : హైదరాబాద్‌లో జరిగే విశ్వరూప మహాసభలను మాదిగలు విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్‌ ఉమ్మడి జిల్లాల కన్వీనర్‌ శివయ్య, ఎంఈఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు పిచుకబాబు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో మాదిగలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్రంలో 8శాతం మంది ఉన్న మాదిగ, మాదిగ ఉపకులాలను అన్ని రాజకీయ పార్టీలు మోసం చేశాయని ఎస్సీ వర్గీకరణకు సహకరించని పార్టీలకు రాబోయే 2024 ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు.

కడప పార్లమెంటు కాపునాడు అధ్యక్షుడిగా రవి

ముద్దనూరు : కడప పార్లమెంటు నియోజకవర్గ కాపునాడు అధ్యక్షుడిగా ఆకుల రవికుమార్‌ నియమితులయ్యారు. మండలంలోని బొందలకుంట గ్రామానికి చెందిన తనను రాయలసీమ కాపునాడు జోన్‌ అధ్యక్షుడు వీరాంజనేయులు, జాతీయ కాపునాడు అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంలు నియమించారని ఆకుల రవికుమార్‌ తెలిపారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



కొండూరు గ్రామప్రజలతో మాట్లాడుతున్న సీఐ, ఎస్‌ఐ

అట్లూరు : కుటుంబంలో ఎవరైనా చెడు వ్యసనాలకు బానిసైతే ఆ కుటుంబం చిన్నాభిన్నమవుతుందని బద్వేలు రూరల్‌ సీఐ హనుమంతనాయక్‌, స్థానిక ఎస్‌ఐ కె.సి.రాజులు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని కొండూరులో గ్రామస్తులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ప్రస్తుత నాగరిక ప్రపంచంలో జీవన శైలి మెరుగుపడాలంటే చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి రోజు సెల్‌ఫోన్‌లలో రకరకాల యాప్‌ల ద్వారా గంటల వ్యవధిలోనే రుణాలు ఇస్తాం, మీ ఏటీఎం కార్డు రెన్యూవల్‌ చేస్తాం, ఓటీపీ చెప్పండి అని సైబర్‌ నేరగాళ్లు మనల్ని కొల్లగొట్టేందుకు ప్రయత్నిస్తుంటారని తెలిపారు. అలాగే సెల్‌ఫోన్‌లలో రకరకాల ఫోన్‌ యాప్‌లు వచ్చాయని, వాటికి ఆశపడి మోసపోవద్దని తెలిపారు.

విద్యాసంస్థల బంద్‌ ను విజయవంతం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ప్రొద్దుటూరు : విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25న నిర్వహించతలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా కార్యదర్శి జి.వలరాజు, ఏఐఎస్‌బీ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్‌ కోరారు. స్థానిక ఎస్సీ కళాశాల వసతి గృహంలో ఆదివారం బంద్‌కు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరిచారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, టీఎన్‌ఎస్‌ఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, ఆర్‌ఎస్‌వైఎఫ్‌ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

కల్వరి టెంపుల్‌ నిర్మాణాన్ని ఆపాలి

ప్రొద్దుటూరు కల్చరల్‌ : మండలంలోని లింగాపురం సమీపంలో నిర్మిస్తున్న కల్వరి టెంపుల్‌ పనులను ఆపాలని ప్రొద్దుటూరు పాస్టర్స్‌ ఫెలోషిప్‌ ప్రెసిడెంట్‌ ఎస్‌.పీటర్‌ అన్నారు. స్థానిక ప్రెస్‌ క్లబ్‌లో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కల్వరి టెంపులో నిర్వాహకుడు సతీష్‌ కుమార్‌ ఎక్కడో ఉండి డిజిటల్‌ ప్రక్రియ ద్వారా ప్రజలను పోగేసుకుంటున్నారన్నారు. ఆయన బైబిల్‌ పేరుతో వ్యాపారం చేస్తూ తనకంటూ ఒక సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారని, బైబిల్‌ సిద్ధాంతానికి వ్యతిరేకంగా నడుచుకుంటూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఈ విషయంపై ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డికి ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు పాస్టర్స్‌ ఫెలోషిప్‌ కార్యదర్శి కృపాకుమార్‌, ట్రెజరర్‌ కేసీ డేవిడ్‌, క్రిస్టియన్‌ పాస్టర్స్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు పీటీ శ్యాముల్‌, పట్టణంలోని పలు చర్చిల ఫాదర్లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ క్రీడాకారులను తయారు చేయాలి



మాట్లాడుతున్న డీఈఓ రాఘవరెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్‌ : వ్యాయామ కళాశాల విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించి ఉత్తమ క్రీడాకారులుగా తయారు చేయాలని డీఈఓ రాఘవరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రాయలసీమ వ్యాయామ కళాశాలలో ఆదివారం ఇంట్రామ్యూరల్‌ పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం పొందొచ్చన్నారు. వ్యాయామ విద్యలో ఉపయోగించే ఎన్నో పదాలు ఆంగ్లం కావడంతో ఇంగ్లీషు భాష నైపుణ్యం పెంపొందించుకోవచ్చన్నారు. సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఇంగ్లీషు భాషకు ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ రవిశంకర్‌ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని ఆటల్లో పాల్గొనేలా చేయడమే అంతర్గత పోటీల లక్ష్యమని తెలిపారు. కార్యక్రమం డైరెక్టర్‌ రవిశంకర్‌రెడ్డి ఎంఈఓలు సావిత్రమ్మ, శోభారాణి, పీఈటీలు షేక్‌ బాబు, శ్రీనివాసులు, హేమాంబర్‌ రెడ్డి, వ్యాపార వేత్త వరదకుమార్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రాచీన యుద్ధ కళలు అంతరించిపోకుండా చూడాలి



విద్యార్థులకు ధనుర్విద్యలో శిక్షణ ఇస్తున్న ప్రముఖ ధనుర్విద్య ఆచార్యులు ఉదయకుమార్‌

బద్వేలు అర్బన్‌ : ప్రాచీన యుద్ధ కళలు అంతరించిపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ప్రముఖ ధనుర్విద్య ఆచార్యులు ఉదయకుమార్‌ తెలిపారు. స్థానిక సరస్వతి శిశుమందిరంలో ప్రాచీన యుద్ధ కళలైన విలువిద్య, ఖడ్గవిద్య, దండవిద్య, శబ్దభేరి, ధ్యానం, యోగా శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. ప్రాచీన యుద్ధ కళలకు ఎంతో ప్రత్యేకత ఉందని, వీటిని సాధన చేయడం వలన గ్రహణశక్తి, మనోధైర్యం, మానసిక ఉల్లాసం కలుగుతాయన్నారు. అంతేకాకుండా ఆత్మరక్షణకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో సరస్వతి శిశుమందిరం ప్రధాన ఆచార్యులు తులసిశివానంద, కమిటీ సభ్యులు, మోటారు వెహికల్‌ ఇన్‌స్పెక్టర్‌ శేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జమాల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్‌ : ఆంధ్రప్రదేశ్‌ గవర్నమెంట్‌ ఎంప్లాయీస్‌ ఫెడరేషన్‌ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 12వ తేదీన గుంటూరులో జరుగుతాయని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు అందరూ అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని గవర్నమెంట్‌ ఎంప్లాయీస్‌ ఫెడరేషన్‌ రాష్ట్ర కో చైర్మన్‌ లెక్కల జమాల్‌రెడ్డి, ఉమ్మడి కడపజిల్లా చైర్మన్‌ మోపూరు శివారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కడప పీఆర్‌టీయూ కార్యాలయంలో ఉమ్మడి కడప జిల్లా ఏపీ గవర్నమెంట్‌ ఎంప్లాయీస్‌ ఫెడరేషన్‌ కార్యవర్గ సమావేశాన్ని జిల్లా చైర్మన్‌ శివారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కో చైర్మన్‌ లెక్కల జమాల్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ గవర్నమెంట్‌ ఎంప్లాయీస్‌ ఫెడరేషన్‌ స్థాపించి ఐదేళ్లకాలంలో ఉద్యోగ,ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల అనేక సమస్యలు పరిష్కరించిందన్నారు. ముఖ్యంగా ఎంపీడీవోలకు పదోన్నతులు, వీఆర్‌ఏ, ఏఆర్వోలకు ప్రమోషన్లు, పాలిటెక్నికల్‌ అధ్యాపకులకు పీఆర్‌సీ ఇప్పించామన్నారు. 1998, 2008 డీఎస్సీ వారికి పోస్టులను ఇప్పించిన ఘనత తమకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్‌ మోపూరు శివారెడ్డి, ఏపీ గవర్నమెంట్‌ ఎంప్లాయీస్‌ ఫెడరేషన్‌ రాష్ట్ర వైస్‌ ప్రెసిడెంట్‌ బోరెడ్డి వరదారెడ్డి, జిల్లా కో చైర్మన్‌ పల్లెం సుబ్బారెడ్డి, వైఎస్సార్‌ టీఎఫ్‌ రాష్ట్ర అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు సజ్జల రమణారెడ్డి, ఎన్‌సీసీ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారెడ్డి, జూనియర్‌ లెక్చరర్స్‌అసోసియేషన్‌ అధ్యక్షుడు రామక్రిష్ణారెడ్డి, ఏపీటీజీ అసోసియేషన్‌ అధ్యక్షుడు బాలశౌరిరెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర సీపీఎస్‌ కన్వీనర్‌ గుజ్జల తిరుపాల్‌, ఎస్‌ఆర్‌టీఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరావు, పెన్షనర్స్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి



మాట్లాడుతున్న సీహెచ్‌ శ్రీనివాస్‌

కడప ఎడ్యుకేషన్‌ : నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని అధ్యాపకుడు సీహెచ్‌ శ్రీనివాస్‌ డిమాండ్‌ చేశారు. ఆదివారం కడపలో రెండవరోజు నిర్వహించిన పీడీఎస్‌యూ రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతుల్లో ప్రభుత్వ విద్య- విద్యార్థుల కర్తవ్యాలు అనే అంశంపై బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానం ద్వారా విద్యార్థుల్లో మనువాద భావజాలాన్ని ఎక్కిస్తున్నారన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌, పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్‌ ఎం.రామక్రిష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు గనిరాజు సహాయ కార్యదర్శి అంకన్న, కిరణ్‌కుమార్‌, ఉపాధ్యక్షులు వినోద్‌, సునీల్‌, జునైద్‌బాష, కోశాధికారి జాకీర్‌, నాయకులు నాగరాజు, జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్‌ పాల్గొన్నారు.

సాహిత్య కార్యక్రమాల నిర్వహణకు 'జింకా' కృషి

కడప కల్చరల్‌ : జిల్లాలో సాహిత్య కార్యక్రమాలను నిర్వహించడంలో జింకా సుబ్రమణ్యం ఎంతో కృషి చేస్తున్నారని కొత్తపల్లి శ్రీను కొనియాడారు. ఆదివారం యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్‌ భాషా పరిశోధన కేంద్రంలో ఉపాధ్యాయులు, సాహితీవేత్త కొత్తపల్లి శ్రీను నెల నెలా సీమ సాహిత్యం కార్యక్రమంలో భాగంగా 'జింకా సుబ్రమణ్యం-జీవితం' అనే అంశంపై మాట్లాడారు. కవిగా, రచయితగా, తెలుగు ఉపన్యాసకుడిగా, పాత్రికేయుడిగా, సాహిత్య సంస్థల సారథిగా జింకా సుబ్రమణ్యం నాలుగు దశాబ్దాలుగా అక్షర సేవ చేస్తున్నారని కొనియాడారు. ప్రొద్దుటూరుకు చెందిన సుబ్రమణ్యం సాహిత్యంపైగల అభిమానంతో వందలాది సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కార్యక్రమ ప్రారంభంలో బ్రౌన్‌ కేంద్రం పూర్వ సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, సహాయ పరిశోధకులు డాక్టర్‌ చింతకుంట శివారెడ్డి, డాక్టర్‌భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, లైబ్రరీ అసిస్టెంట్‌ జి.హరిభూషణరావు, జూనియర్‌ అసిస్టెంట్‌ వెంకట రమణ, మౌనిక, గ్రంథాలయ సలహా మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్‌, సాహితీవేత్త గానుగపెంట హనుమంతరావు తదితరులు వక్తను, ముఖ్య అతిథిగా హాజరైన జింకా సుబ్రమణ్యంను ఘనంగా సత్కరించారు.

దేశం గర్వించదగ్గ విద్యా ప్రదాత డాక్టర్‌ బీఎస్‌ రావు





బీఎస్‌రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా- మాట్లాడుతున్న నగర మేయర్‌ సురేష్‌బాబు

కడప ఎడ్యుకేషన్‌: వైద్య వృత్తిని వదిలి విద్యారంగంలో సంచనాలను సృష్టించిన బీఎస్‌ రావు దేశం గర్వించదగ్గ విద్య ప్రదాత అని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్‌బాష, డిప్యూటీ మేయర్‌ సురేష్‌బాబు అన్నారు. ఆదివారం కడప నగరంలోని మాధవి కన్వెన్షన్‌హాల్‌లో బీఎస్‌రావు సంస్మరణ సభ శ్రీచైతన్య విద్యాసంస్థల రాయలసీమ ఏజీఎం డేరంగుల రమణయ్య అధ్యక్షతన ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ డాక్టర్‌ బొప్పన సత్యనారాయణరావు(బీఎస్‌ రావు) రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్యార్థులకు మేలిమి విద్యను అందిస్తూ విద్యారంగంలోనే సరికొత్త ఒరవడి సృష్టించారన్నారు. గుంటూరు జిల్లా అంగలూరు అనే చిన్న గ్రామంలో జన్మించిన బీఎస్‌ రావు లక్షలమంది విద్యార్థులను ఐఏఎస్‌, ఐపీఎస్‌, డాక్టర్లు, ఇంజనీర్లుగా తీర్చిదిద్దారని తెలిపారు. బీఎస్‌ రావు , ఆయన సతీమణి ఝాన్సీ ఇద్దరూ వైద్యులుగా ఇంగ్లాండ్‌, ఇరాన్‌ , ఇరాక్‌లలో 12 ఏళ్లు వైద్య సేవలందించి తర్వాత విజయవాడకు వచ్చి విద్యాసంస్థలను ఏర్పాటు చేశారన్నారు. కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యాసంస్థలు విద్యార్థులను అన్ని విధాలుగా తీర్చిదిద్దుతూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ టీటీడీ పాలక మండలి సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు , విద్యా సంస్థల రాయలసీమ ఏజీఎం డేరంగుల రమణయ్య కూడా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నారాయణ, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్‌ అధ్యక్షుడు డాక్టర్‌ రంగనాథరెడ్డి, చైతన్య కళాశాల డీఎన్‌ విజయభాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు నాగరాజు ఏఓలు మనోజ్‌రెడ్డి, మల్లికార్జున స్వామి, శ్రీచైతన్య స్కూల్స్‌ ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.